



# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 26-02-2025 సంపుటి : 06 సంచిక : 289 పేజీలు : 8 వెల : రూ 1-00


# ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తాం

**వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కిస్తున్నాం**
**సకాలంలో పెన్షన్లు, జీతాలు చెల్లిస్తున్నాం**
**త్వరలోనే డీఎస్సీ కూడా నిర్వహిస్తాం**
**గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంలో సీఎం చంద్రబాబు**



అమరావతి,ఫిబ్రవరి25( ): ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని తప్పకుండా అమలు చేసి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే బయటకు తెస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. తల్లికి వందనం సహా.. అనేక పథకాల అమలును ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. తల్లికి వందనం పథకం అమలు వ్యవహారంపై మాట్లాడిన సీఎం.. ఈ పథకాన్ని మే నెలలో అమలు చేస్తామని చెప్పారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా.. పథకాన్ని అమలు చేస్తామన్నారు. మే నెలలో ఈ పథకం డబ్బులు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. రైతుకు భరోసా కల్పించే విషయంలో తాము చెప్పినట్లుగానే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు సీఎం. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా కేంద్రం ఇచ్చే కిసాన్ సమ్మాన్ నిధి యోజన రూ. 6000, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.14 వేలు కలిపి మొత్తం రూ. 20వేలు ఇస్తామన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతిదీ అమలు చేస్తామని ముఖ్యమంత్రి మరోసారి ఉద్ఘాటించారు. ఇక దివ్యాంగులకు రూ. 3 వేల నుంచి రూ. 6 వేలు పింఛను పెంచామన్నారు. సాధారణ పింఛన్‌ను రూ. 3 వేల నుంచి 4 వేలకు పెంచామన్నారు. రూ. 33 వేల కోట్ల రూపాయలు ప్రతి సంవత్సరం పింఛన్లు ఇచ్చే దేశంలోనే ఏకైక కార్యక్రమం ఇది అని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. ఎన్ని కష్టాలు ఉన్నా గవర్నమెంట్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అందరికీ సమయానికి జీతాలు ఇస్తున్నామని, ఈ విషయాన్ని గర్వంగా చెబుతున్నామని సీఎం చెప్పారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక.. అన్న క్యాంటిన్లు మూసేశారని.. ఇప్పుడు తాము తిరిగి ప్రారంభించామన్నారు. పేదలకు దీపం కార్యక్రమం ద్వారా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చామని.. ఆ హామీని అమలు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ పథకం ద్వారా 93 లక్షల మందికి దీపం 2 అందుతోందన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి డీఎస్సీ సెలక్షన్ పూర్తి చేసి బడులు తెరుస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇక మత్స్యకారులకు సైతం అండగా ఉంటామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. మత్స్యకారులకు రూ. 20 వేలు ఇస్తామన్నారు. ప్రతి సంవత్సరం వారికి హాలిడే ఇస్తామని.. ఆ హాలిడే కంటే ముందుగానే ఆర్థిక సాయం చేసి ఆదుకుంటామన్నారు. వైకాపా హయాంలో జరిగిన సభ కౌరవ సభ. కౌరవసభను గౌరవసభ చేశాకే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేశా. గౌరవసభను అవమానించే పార్టీ ఇవాళ అసెంబ్లీలో లేకుండా పోయింది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననడం ఎప్పుడూ చూడలేదు. సంప్రదాయాలను మరిచి ప్రతిపక్ష హోదా ఇవ్వాలనడం సమంజసమా? ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది మేం కాదు.. ప్రజలు. నిన్న వైకాపా నేతలు కేవలం 11 నిమిషాలే సభలో ఉన్నారని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తాం అన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం మేం కలిసి పోటీ చేయలేదు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాలనే లక్ష్యంతోనే కలిసి పోటీ చేశాం. వైకాపా పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యమైంది. డబుల్ ఇంజిన్ సర్కార్ లేకుంటే రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయలేమని భావించాం. రాష్ట్రవృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తున్న కేంద్రానికి ధన్యవాదాలని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు 16,384 టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. మే నెలలో తల్లికి వందనం పథకం అమలు చేస్తాం. ఎంత మంది పిల్లలున్నా అందరికీ అమలు చేస్తాం. కేంద్ర పథకాలకు ఇచ్చిన గ్రాంట్‌ను కూడా గత ప్రభుత్వం వాడేసింది. జల్‌జీవన్ కోసం రూ.80వేల కోట్లు కావాల్సి ఉంటే.. గత ప్రభుత్వం కేవలం రూ.20వేల కోట్లు అడిగింది. అందరూ గర్వపడేలా రాజధాని నిర్మిస్తాం గత ప్రభుత్వంలో రంగుల పిచ్చి ఎక్కువయ్యింది.. సర్వే రాళ్లపైనా బొమ్మలు వేసుకున్నారు. పేదరికం లేని సమాజాన్ని తయారు చేయడమే మా లక్ష్యం. ఇళ్లు లేని పేదలకు ఐదేళ్లలో ఇళ్లు నిర్మిస్తాం. గ్రామీణ పేదలకు 3 సెంట్ల ఇంటి స్థలం ఇస్తాం. ఉగాది రోజున పీ-4 విధానాన్ని ఆవిష్కరిస్తాం. 20లక్షల ఉద్యోగాల కల్పన మా ప్రభుత్వ బాధ్యత. రూ.6.50లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూ పూర్తి చేశాం.

## గవర్నర్ కు వీడ్కోలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 25-రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ దంపతులు రెండు రోజుల శ్రీశైలం పర్యటన ముగించుకొని మంగళవారం సున్నిపెంట హెలిపాడ్ మైదానం నుంచి హెలిపాడ్ లో విజయవాడకు బయలుదేరి వెళ్లారు.రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ గారికి రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ జి రాజకుమారి, కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ రాష్ట్ర గవర్నర్ గారికి ఘనంగా వీడ్కోలు పలికారు.

## ఢిల్లీ అసెంబ్లీ సెషన్ మరో రెండు రోజులు పొడిగింపు..


హైదరాబాద్ : ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలను మరో రెండు రోజులు పొడిగించారు. షెడ్యూల్ ప్రకారం అసెంబ్లీ ఫిబ్రవరి 24, 25, 27



తేదీల్లో మూడు రోజులపాటు కొనసాగాల్సి ఉంది. తాజాగా ఢిల్లీ సర్కారు ప్రకటించిన ప్రకారం ఫిబ్రవరి 28, మార్చి 1న కూడా సమావేశాలు జరగనున్నాయి. అంటే ఈ ప్రత్యేక సెషన్ మూడు రోజులకు బదులుగా మొత్తం ఐదు రోజులు కొనసాగనుంది.







# సంపాదకీయం

బుధవారం 26-02-2025

## మళ్లీ తెరపైకి త్రిభాషా సూత్రం.. ఉద్యమం

కేంద్ర ప్రభుత్వం బలవంతంగా త్రిభాషా సూత్రం కింద హిందీ భాషను అమలులోకి తీసుకురావాలన్న ప్రయత్నాలను దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా తమిళనాడులో అమలు చేయడానికి ప్రయత్నించడాన్ని మొదటినుంచి ఆ రాష్ట్రం వ్యతిరేకిస్తున్న చరిత్ర ఉంది. హిందీ వ్యతిరేక ఉద్యమాల్లో ఎందరో ప్రాణాలు కోల్పోయారు. కొన్ని వేలమంది అరెస్టు అయ్యారు. ఇప్పుడు మళ్లీ ఈ వివాదం తెరపైకి వచ్చింది. హిందీని అంగీకరించే రాష్ట్రాలు తమ మాతృభాషను కోల్పోతాయని, అవసరమైతే తమ రాష్ట్రం భాషా యుద్ధానికి సిద్ధంగా ఉందని తమిళనాడు డిఎంకె ప్రభుత్వం స్పష్టం చేయడం కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వివాదం రాజుకుంటోంది. జాతీయ విద్యా విధానాన్ని పూర్తిగా స్వీకరించకపోతే, ప్రస్తుతం అమలవుతున్న సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఎ) కింద రాష్ట్రానికి దాదాపు రూ. 2400 కోట్ల నిధులు కేటాయించడం కుదరదని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెగేసి చెప్పడం మళ్లీ హిందీ వ్యతిరేక ఉద్యమానికి సన్నాహాలు ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తీవ్రంగా స్పందించి కేంద్ర ప్రభుత్వానికి ఘాటుగా సమాధానం ఇచ్చారు. ఇది మీ సొంతడబ్బు కాదని, పన్నుల వికేంద్రీకరణనుండి తమ రాష్ట్రానికి రావలసిన డబ్బు వాటా మాత్రమే డిమాండ్ చేస్తున్నామని ఎత్తిచూపారు. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ మీరు (బిజెపి) మమ్మల్ని బెదిరించాలని అనుకుంటే అది తమిళనాడులో ఎప్పటికీ జరగదు" అని చెన్నైలో డిఎంకె సారథ్యంలో జరిగిన నిరసన ర్యాలీలో స్టాలిన్ హెచ్చరించారు. ఇది ద్రావిడ భూమి, పెరియార్ భూమి? అని బిజెపికి గుర్తు చేస్తూ.. గతసారి మీరు తమిళ ప్రజల హక్కులను హరించడానికి ప్రయత్నించినప్పుడు వారు 'గోబ్యాక్ మోడీ' అని ఉద్యమించారు. మీరు మళ్లీ ప్రయత్నిస్తే ఈసారి 'గో అవుట్ మోడీ' అన్న నిరసనలతో మిమ్మల్ని వెనక్కు పంపడానికి భారీ ఎత్తున ఆందోళన లేవడం తథ్యం' అని హెచ్చరించారు. ఉదయనిధి స్టాలిన్ హిందీని అంగీకరించడంపై ఎదురయ్యే అనర్థాలను తెలియజేస్తూ అనేక రాష్ట్రాలు తమ మాతృభాషలను కోల్పోతున్నాయని ఉదాహరణగా భోజ్‌పురి, బీహార్, హర్యానీ భాషలు హిందీ చొరబాటుతో దాదాపు అంతరించాయని వివరించారు. త్రిభాషా సూత్రంపై దక్షిణాది రాష్ట్రాలకు, కేంద్రానికి మధ్య చాలా కాలంగా వివాదం ఉంటోంది. ఐదేళ్ల క్రితం కేంద్రం కొత్త విద్యావిధానాన్ని ప్రకటించింది. అప్పటినుంచి ఈ వివాదం మరింత వైరుధ్యంగా పెరిగింది. ఈ కొత్త విద్యావిధానం కింద విద్యార్థులు తప్పనిసరిగా మూడు భాషలను నేర్చుకోవలసి వస్తుంది. వీటిలో హిందీ ఒకటి. గత వారం వారణాసిలో కేంద్ర విద్యామంత్రి ప్రధాన్ తమిళనాడు ప్రభుత్వాన్ని ప్రత్యేకించి రాజకీయ ప్రయోజనాల కారణంగా ఈ విధానాన్ని అంగీకరించడం లేదని ఆరోపించారు. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని హిందీభాష చిచ్చును రగిలించి తమిళనాడును రాజకీయంగా చీలికలు తెచ్చి తమ పబ్బం గడుపుకోవాలన్నది బిజెపి ఎత్తుగడ. చారిత్రకంగా చూస్తే తమిళ ఓటర్లు బిజెపికి దూరంగానే ఉంటున్నారు. 2016లో మొత్తం 234 సీట్లలో బిజెపి పోటీచేసినా ఒక్కస్థానం కూడా దక్కలేదు. 2021లో కేవలం 20 స్థానాల్లో మాత్రమే పోటీ చేసినా, నాలుగు మాత్రమే గెల్చుకుంది. లోక్‌సభ ఎన్నికల రికార్డు చూసినా అధ్వానమే. 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా సున్నాయే వచ్చింది. తమిళనాడు చారిత్రాత్మకంగా 'ద్విభాషా' విధానాన్ని కలిగి ఉంది. అంటే తమిళం, ఆంగ్ల భాషలను బోధిస్తుంది. 20వ శతాబ్దం ప్రారంభం నుంచి దక్షిణ భారత రాష్ట్రం తమిళనాడులో (గతంలో మద్రాస్ రాష్ట్రం, మద్రాస్ ప్రెసెడెన్సీలో భాగం) హిందీ వ్యతిరేక ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. 1937లో సి. రాజగోపాలాచారి నేతృత్వంలోని మొదటి భారత జాతీయ కాంగ్రెస్ (ఐఎన్‌సి) ప్రభుత్వం మద్రాస్ ప్రెసిడెన్సీ పాఠశాలల్లో హిందీబోధన తప్పనిసరి చేయాలని ప్రయత్నించింది. దీనికి పెరియార్ ఇవి రామస్వామి, సోమసుందర భారతీయార్, ప్రతిపక్ష జస్టిస్ పార్టీనుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. మూడేళ్ల పాటు సాగిన ఉద్యమాలలో 1198 మంది అరెస్టు కాగా, ఇద్దరు మరణించారు. 1940లో తప్పనిసరి హిందీ విద్యాబోధనను ఉపసంహరించుకున్నారు. దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత, 1950 జనవరి 25న కొత్త రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత అనేక హిందీయేతర రాష్ట్రాలు హిందీని ఏకైక అధికార భాష గా చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించాయి. అప్పటి మద్రాస్ రాష్ట్రంలో డిఎంకె (ద్రవిడ మున్నేట్ర కజగం) నేతృత్వంలో హిందీ వ్యతిరేక ఉద్యమం సాగింది. 1965 జనవరిలో విద్యార్థుల మద్దతుతో హిందీ వ్యతిరేక ఉద్యమం హింసాత్మక సంఘటనలతో రెండు నెలల పాటు సాగింది. పారా మిలిటరీ ప్రమేయంతో ఇద్దరు పోలీసులతో సహా 70 మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పటి ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి హిందీయేతర రాష్ట్రాలు కోరుకున్నంత కాలం ఇంగ్లీష్ అధికారిక భాషగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. దీంతో అల్లర్లు, విద్యార్థుల ఆందోళనలు సద్దు మణిగాయి. 1967లో ఇందిరా గాంధీ ప్రభుత్వం అధికారిక భాషల చట్టాన్ని సవరించింది. ద్విభాషా విధానాన్ని నిర్ధారించింది. 1968, 1986లో కూడా హిందీ వ్యతిరేక ఉద్యమాలు జరిగాయి. హిందీ భాష తప్పనిసరి అని కేంద్ర ప్రకటిస్తున్నప్పుడెల్లా దాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడులో ఉద్యమాలు సాగుతుండడం పరిపాటి అవుతోంది.

## కాంగ్రెస్ పార్టీ డోన్ పట్టణ అధ్యక్షులు గా యాదరబోయిని శేఖర్...



విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:-ఫిబ్రవరి 25 డోన్ పట్టణం నెహ్రూ నగర్ కు చెందిన యాదర బోయిన శేఖర్ ను కాంగ్రెస్ పార్టీ డోన్ పట్టణ అధ్యక్షులుగా మరియు కమలాపురం గ్రామానికి చెందిన పఠాన్ మహబూబ్ హుస్సేన్ ను డోన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నంద్యాల జిల్లా అధ్యక్షులు జంగిటి లక్ష్మి నరసింహ యాదవ్ మరియు డోన్ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ గార్లపాటి మద్దులేటీ స్వామి, డిసిసి ఉపాధ్యక్షులు యు. జనార్దన్ ల సలహా మేరకు పీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి వై ఎస్ షర్మిల రెడ్డి మంగళవారం డోన్ పట్టణం అధ్యక్షులు గా వై శేఖర్ ను మరియు డోన్ మండల అధ్యక్షులు గా పఠాన్ మహబూబ్ హుస్సేన్ లను నియమించింది, వీరు గత 10 సంవత్సరాలనుండి నుండి కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ లో పని చేస్తూ అంచెలంచెలుగా ఎదిగి పట్టణ,మండల అధ్యక్షులు గా నియమించి నందుకు పీసీసీ అధ్యక్షురాలు వై ఎస్ షర్మిల రెడ్డి కి, నంద్యాల జిల్లా అధ్యక్షులు జె. లక్ష్మి నరసింహ యాదవ్ కి, డోన్ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ గార్లపాటి మద్దులేటీ స్వామి కీ, డిసిసి ఉపాధ్యక్షులు యు జనార్దన్ లకుకృతజ్ఞతలు తెలియ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తానని,మండలములో పార్టీ లో పని చేసిన వారిని కలసి, వారి సలహాలు సూచనలు తీసుకొని పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని డోన్ మండలంలో ఉన్న అన్ని గ్రామాలలో మరియు డోన్ పట్టణములో ని అన్ని వార్డులలో పార్టీ బలోపేతానికి ప్రయత్నం చేస్తాను, నా మీద నమ్మకముతో ఈ పదవి ఇచ్చినందుకు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారుడోన్ మండలానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా పఠాన్ మహమ్మద్ హుస్సేన్, డోన్ పట్టణ అధ్యక్షులు గా యాదర బోయిని శేఖర్ ను నియమించినదుకు డోన్ నియోజకవర్గం ఇంచార్జి డాక్టర్ గార్లపాటి మద్దులేటీ స్వామి, డిసిసి ఉపాధ్యక్షులు యు. జనార్దన్,సీనియర్ నాయకులు దీవన్న, డీసిసి నాయకులు ఏం. జయరాం,లీగల్ సెల్ నాయకులు వి. జీవన్ బాబు,ప్యాపీలి మండల అధ్యక్షులు శనగల మహేంద్ర, బేతంచెర్ల మండల అధ్యక్షులు ధోని రామంజనేయులు, డిసిసి నాయకులు వడ్డే రాజశేఖర్, గోపినాథ రావ్,లక్ష్మణ్ ఆర్.మల్లికార్జున, లోక్ నాథ్, డోన్ నాయకులు పి.బాలు, పి.సురేష్,ఎం. మధుకుమార్ నాయుడు, అరిగేల రమేష్ కుమార్, మహమ్మద్, డి గోపాల్, ఎన్ మౌలాలి, ఎమ్ భూపాల్, రహీం, సి.మధు, మధు సుధన్ రెడ్డి, నాగరాజ్, ఖాజా, నాగన్న లుహర్షంవ్యక్తం చేశారు. పార్టీ కొరకు కష్టపడే వారిని గుర్తించి అధ్యక్షులు గా నియమించినందుకు పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి కి నంద్యాల జిల్లా అధ్యక్షులు జె.లక్ష్మి నరసింహ యాదవ్ కి కృతజ్ఞతలు తెలియ చేశారు.

## విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన వీఆర్ఏ కుటుంబానికి న్యాయం చేయాలి....



విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:-ఫిబ్రవరి 25 డోన్ డివిజన్,అవుకు మండలం,ఉప్పలపాడు గ్రామంలో భూ సర్వేలో భాగంగా విధులు నిర్వహిస్తూ విద్యుత్ ప్రమాదానకి గురై మృతి చెందిన ఉప్పలపాడు గ్రామ విఆర్ఎ తలారి రాముడు (56) కుటుంబానికి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం,ఎపి.గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం డోన్ డివిజన్ నాయకులు టి.రామచంద్రుడు,ప్యాపిలి మండల ప్రధాన కార్యదర్శి బి.రామనాయుడు,డోన్ మండల ఉపాధ్యక్షులు శివశంకర వరప్రసాద్, సహాయ కార్యదర్శి రంగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డోన్ ఆర్డీవో కార్యాలయం నందు డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జి.అంజన్ బాబు కి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అవుకు మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో భూ సమగ్ర సర్వేలో భాగంగా సోమవారం భూములను సర్వే చేసేందుకు రెవెన్యూ సిబ్బందితో కలిసి వెళుతున్న సమయంలో తలారి రాముడు భుజంపై ఉన్న భూములను కొలతలు కొలిచే ఇనుప పరికరం రోవర్ పొలంలో క్రిందకు వేలాడుతున్న విద్యుత్తు తీగలకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందేనన్నారు. తలారి రాముడు ఉప్పలపాడు గ్రామంలో గత 30 సంవత్సరాలుగా గ్రామ రెవెన్యూ సహాయకుడిగా విధులు నిర్వహిసున్నాడన్నారు. అతనికి భార్య తలారి లక్ష్మీదేవి,ఒక కుమారుడు,ఇద్దరు కుమార్తెలు సంతానం ఉండగా వారిలో కుమారుడు రవి కుమార్, కుమార్తె రాజేశ్వరి పుట్టుకతోనే వికలాంగులని వారు జీవితాంతం మంచానికే పరిమితం అని ఆవేదన వ్యక్తం చేశారు. కావున తలారి రాముడు కుటుంబంలో ఒకరికి తక్షణమే ఉద్యోగం ఇవ్వాలని,50 లక్షల రూపాయలు నష్టపరిహారంగా చెల్లించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని,అదేవిధంగా విద్యుత్ తీగలు క్రిందకు వేలాడుతున్నా పట్టించుకోక నిర్లక్ష్యంగా వ్యవహరించి తలారి రాముడు మృతికి కారకులైన విద్యుత్ అధికారులపై సమగ్ర విచారణ జరిపించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డోన్,ప్యాపిలి విఆర్ఎలు రవికుమార్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ముగింపు..

విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:-నవంబర్ 25 డోన్ పట్టణంలో ని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్వాడీ టీచర్లకు ఆరు రోజుల వృత్యాంతర శిక్షణలో భాగంగా సాల్ట్ ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ లు ప్రభాకర్ హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటితో ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం పూర్తి




అవుతున్నది కావున అంగన్వాడీ టీచర్లు అందరు శిక్షణ కార్యక్రమంలో మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లల సమగ్ర అభివృద్ధి పై విన్నటువంటి విషయాలను క్షేత్రస్థాయిలో విద్యార్థులు ఆచరించే విధంగా బాధ్యత వహించాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ శంషాద్ బేగం, సూపర్వైజర్లు పద్మావతి, పరమేశ్వరి, శోభారాణి, అరుణ డిఆర్పీలు మన్సూర్ భాష, రఘు పవన్ కుమార్, సుమన్ తదితరులు పాల్గొన్నారు

## మీడియాపై పక్షపాత ధోరణి మానుకోవాలి ఏపీయూడబ్ల్యూజే,



నంద్యాల విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 25-రాష్ట్ర శాసనసభ సమావేశాలకు కొన్ని చానల్స్, పేపర్ల రిపోర్టర్లను అనుమతించకపోవడంపై ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఖండే శ్యామ్ సుందర్ లాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుబాబు, ఉస్మాన్ బాషా, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు సివి చలంబాబు తప్పుపట్టారు. ఈ విషయంలో స్పీకర్ నిర్ణయం సరైనది కాదన్నారు. గత వైసిపి ప్రభుత్వం చేసిన తప్పులనే ఈ విషయంలో వీరు కూడా చేస్తున్నారని, అలాగే ముఖ్యమంత్రి అధికారిక సమావేశాలకు కూడా కొన్ని పత్రికలు, చానల్స్ ను పిలవకపోవడం తగదన్నారు. స్పీకర్, ప్రభుత్వం తమ వైఖరి మార్చుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు, అసెంబ్లీ సమావేశాలకు టీవీ9, ఎన్టీవీ, టెన్ టీవీ, సాక్షి టీవీ, సాక్షి పేపర్ తో పాటు మిగిలిన అన్ని చానల్స్, పేపర్స్ కు అనుమతి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

## 28వ తేదీ శుక్రవారం అమావాస్య సందర్భంగా శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు..



విభారే న్యూస్ ఫిబ్రవరి 25 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సుల తో 28-02- 2025 శుక్రవారం అమావాస్య సందర్భంగా సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి శత్రు నివారణ, బాలగ్రహ దోష నివారణ, శని గ్రహ దోష నివారణ, బుద్ధి,బలం,యశో,ధైర్యం, కార్యసిద్ధి, కొరకు ఉదయం 10 గంటలకు సింధూరార్చన జరుగును. పూజలో పాల్గొన్న భక్తులకు ఆంజనేయ స్వామి డాలరు సింధూరం ప్రసాదంగా ఇవ్వబడును. రుసుము 250-/ గుమ్మడికాయ -300/- సంప్రదించవలసిన నెం :- అశోక్ కుమారాచార్యులు 9032577 369.. దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబర్. 8896123777.. ల్యాండ్ ఫోన్ నెంబర్. 08518-234388..

## మహాశివరాత్రి సందర్భంగా శ్రీ గౌరీ శంకర స్వామి వారికి ప్రత్యేక పూజలు..

విభారే న్యూస్ ఫిబ్రవరి 25 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో 26.02.2025 బుధవారం మహాశివరాత్రి సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ గౌరీ శంకర స్వామి వారికి ఉదయం 6:00 గం"ల నుండి రుద్రాభిషేకములు జరుపబడును. ఉదయం 11.00 గం"లకు మృత్యుంజయ పాశుపత రుద్రహోమ సహిత కాలభైరవ, రాజ శ్యామల హోమం జరుగును. తిరిగి సాయంకాలం 6 గం"లకు నుండి నుండి రుద్రాభిషేకములు రాత్రి 11.00 గం లకు మహన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకములు లింగోద్భవ కాలంలో నిర్వహించబడును. 27-02-2025 గురువారం సాయంత్రం 06.30 గం"లకు శివపార్వతుల కళ్యాణం జరుపబడును. ఏక వార రుద్రాభిషేకములు:- 200 /- మహన్యాస పూర్వ ఏక దశవారం లింగోద్భవంలో:- 300 /- రుద్రహోమం,రాజ శ్యామల హోమం ప్రధానంగా:-4000/-రుద్రహోమసంకల్పం:-116/శివపార్వతులకల్యాణంప్రధానంగా:2500/శివపార్వతులకళ్యాణం సంకల్పం:-116/- సంప్రదించవల సిన నెంబరు. డి లక్ష్మీనరసింహశర్మ. 8008774086దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు. 8896123777ఆఫీస్ ల్యాండ్ లైన్ నెంబర్:08518-234388..

## ఎమ్మిగనూరు ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి..

విభారే న్యూస్ ఫిబ్రవరి 25 ఎమ్మిగనూరు..సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి ఎమ్మిగనూరు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మిగనూరు పట్టణం అభివృద్ధి బాటలో దూసుకుపోతోందని అన్నారు. ప్రజలందరూ సకాలంలో తాము చెల్లించాల్సిన పన్నులు కడితే మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు.



# పార్టీకి జీవీరెడ్డి షాక్...

విజయవాడ, ఫిబ్రవరి 25, తెలుగుదేశం పార్టీ యువనేత, ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి  తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు ఫైబర్ నెట్ చైర్మన్ పదవికి కూడా రాజీనామా చేశారు. ఈ విషయాన్ని తన సోషల్ మీడియా హ్యాండిల్ లో ప్రకటించారు. తాను ఇక ఏ రాజకీయ పార్టీలో చేరబోనని లాయర్ గా తన వృత్తిని కొనసాగిస్తానని ఆయన ప్రకటించారు. నెట్ చైర్మన్ గా ఆయన కొద్ది కాలం కిందటే బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి నుంచి ఆయన ఫైబర్ నెట్ లో గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను బయటకు తీసేందుకు ప్రయత్నించారు. రామ్ గోపాల్ వర్మకు పెద్ద ఎత్తున డబ్బులు చెల్లించిన వైనాన్ని జీవీ రెడ్డి బయట పెట్టి ఆయనకు నోటీసులు జారీ చేశారు. పదిహేను రోజుల్లోగా డబ్బులు చెల్లించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆ మధ్య 410 మంది ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్లుగా కూడా ప్రకటించారు.వారం రోజుల కిందట ఆయన ప్రెస్ మీట్ పెట్టి నేరుగా  ఫైబర్‌నెట్ ఎండీ,  ఐఏఎస్ దినేష్ పై ఆరోపణలు చేశారు. వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలను బయటకు రాకుండా కాపాడుతున్నారని మండిపడ్డారు. 410 మంది ఉద్యోగుల్ని తీసేయమని చెప్పినా ఇంకా జీతాలిస్తున్నారని.. ఆ డబ్బుల్ని దినేష్ దగ్గర నుంచి వసూలు చేయాలన్నారు. దినేష్ పేషీలో పని చేస్తున్న ముగ్గురు అధికారుల్ని విధుల్నించి తొలగిస్తున్నట్లుగా ప్రకటించారు. ఫైబర్ నెట్ ను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు.జీవీ రెడ్డి చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. ఆయన చేసిన ఆరోపణలపై ఐఏఎస్ అధికారుల సంఘం కూడా  ముఖ్యమంత్రి చంద్రబాబు  దృష్టికి తీసుకెళ్లింది. దీంతో సంబంధిత శాఖకు మంత్రి అయిన బీసీ జనార్ధన్ రెడ్డి ఈ వ్యవహారంపై ఆటు ఫైబర్ నెట్ ఎండీ దినేష్ తో పాటు ఇటు ఆరోపణలు చేసిన ఫైబర్ నెట్ చైర్మన్  జీవీ రెడ్డిని పిలిచి మాట్లాడారు. జీవీ రెడ్డి చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలని అడిగినట్లుగా తెలుస్తోంది.  ఆయన తన వద్ద ఉన్న సమాచారం ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ఇంతలో ఏమయిందో కానీ.. జీవీ రెడ్డి హఠాత్తుగా రాజీనామా చేశారు. గతంలో వైసీపీలో పని చేసిన జీవీరెడ్డి అక్కడ సరైన గౌరవం లభించకపోవడంతో టీడీపీలో చేరారు. ఆయనకు మంచి వాగ్దాటి ఉండటంతో అధికార ప్రతినిధి హోదా ఇచ్చారు. టీవీ చర్చల్లో ధాటిగా టీడీపీని సమర్ధించేవారు. వైసీపీ తీరును ఎండగట్టే వారు. జీవీ రెడ్డి వ్యవహారంపై టీడీపీ క్యాడర్ లో సానుభూతి ఉంది. ఆయనకు మద్దతుగా టీడీపీ కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.  దినేష్ రెడ్డి బదిలీటీడీపీకి జీవీ రెడ్డి రాజీనామా చేయడంతో ప్రభుత్వం స్పందించింది. వెంటనే ఏపీ ఫైబర్ నెట్ ఎండీని దినేష్‌ను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు ఐఏఎస్ దినేష్  ఫైబర్ నెంట్ ఎండీతో పాటు ఆర్టీజీఎస్, గ్యాస్, డ్రోన్ కార్పొరేషన్ల బాధ్యతలు కూడా చూస్తున్నారు. అన్ని బాధ్యతల నుంచి ఆయనను ప్రభుత్వం తప్పించింది. జీఏడీకి రిపోర్టు చేయమని ఆదేశించింది. అంటే ఆయనకు పోస్టింగ్ లేదని  అర్థం . .గ్రూప్2 వివాదం తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో మరో వివాదం చెలరేగింది. ఫైబర్ నెట్‌లో జరుగుతున్న లుకలుకలు తారా స్థాయికి చేరాయి. ఏపీ ఫైబర్ నెట్‌లో ఉన్న ఉన్నతాధికారులు మాట వినడం లేదని ఆ సంస్థ చైర్మన్ జీవీ రెడ్డి ఆరోపించారు. నాడు టీడీపీని, కూటమి పార్టీలను తిట్టిన వారందరికీ నేడు కూడా జీతాలు ఇస్తున్నారని వాపోయారు. అలాంటి వారిని కొనసాగించడం వెనుక ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు. నాడు వైసీపీలో పెత్తనం చెలాయించిన వారే ఇప్పుడు కూడా సంస్థలో ఉన్నత స్థాయిలో ఉన్నందునే ఇలాంటివి జరుగుతున్నాయని ఆయన ఓపెన్ గాని చెప్పారు. ప్రెస్‌మీట్ పెట్టి ఇలా ఓపెన్‌గా అధికారులను తిట్టడం వైరల్‌గా మారింది. దీనికి టీడీపీ కార్యకర్తలు కూడా వంత పాడారు. అయితే ప్రభుత్వ పెద్దలు దీని కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. ఈ వివాదంలో అసలేం జరిగిందో కానీ.. మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లుగా కనిపిస్తోంది. జీవీరెడ్డితో రాజీనామా చేయించడంతో ఆయన పార్టీ కి కూడా రాజీనామా చేశారు.  ఫైబర్ నెట్ వ్యవహారం మొదటి నుంచి వివాదాస్పదంగా ఉంది. జీవీ రెడ్డి చైర్మన్ గా బాధ్యతలు తీసుకున్న తర్వాత పలు అక్రమాలను వెలుగులోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నించారు. వైసీపీ హయాంలో చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టించేందుకు చేసిన ప్రయత్నాలకు సంబంధించి ఫైళ్లను కూడా బయటకు తీసి..  పలు ఆరోపణలు చేశారు. అయితే ఎక్కడ గ్యాప్ వచ్చిందో కానీ.. దినేష్ కుమార్ తో ఆయనకు సరిపడలేదు. దాంతో వివాదం ప్రారంభమయింది.

# చకచకా అమరావతి పనులు



విజయవాడ, ఫిబ్రవరి 25, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనుల ప్రారంభానికి ముహుర్తం ఖరారైంది. మార్చి 15వ తేదీ నుంచి అమరావతి పనులు ప్రారంభం కానున్నాయి. అమరావతిలో వివిధ రకాల పనులు చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం ఇప్పటికే టెండర్లు ఆహ్వానించింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా పనుల్లో జాప్యమైంది. ఎన్నికల సంఘం ఆదేశాలతో టెండర్ల ఖరారులో ఆలస్యం జరిగింది. తాజాగా టెండర్లు పిలిచేందుకు ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా టెండర్లను ఖరారు చేయొద్దని ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించి ఇప్పటి వరకు 62 పనులకు అధికారులు టెండర్లు పిలిచారు. రూ.42 వేల కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలోనే మరో 11 పనులకు కూడా టెండర్లు పిలవనున్నట్లు సమాచారం. టెండర్లు పిలిచేందుకు ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వటంతో త్వరలోనే టెండర్లు పిలవనున్నారు. మార్చి 15 నుంచి అమరావతిలో పనులు ప్రారంభం కానుండగా.. ఏప్రిల్ నుంచి జోరందుకోనున్నాయి. ఏప్రిల్ మొదటి వారం నుంచి 30 వేల మంది కార్మికులతో అమరావతిలో పనులు జరుగుతాయని అధికారులు చెబుతున్నారు. జంగిల్ క్లియరెన్స్ పనులు కూడా ఇప్పటికే పూర్తి అయిన నేపథ్యంలో నిర్మాణ పనులు వేగంగా జరుగుతాయని అధికారులు చెప్తున్నారు.మరోవైపు తెలుగుదేశం పార్టీ 2014-19 మధ్యన అధికారంలో ఉన్న సమయంలో రాజధాని అమరావతిలో ఎన్‌ఆర్‌టీ ఐకానిక్ భవనం నిర్మాణం తలపెట్టిన సంగతి తెలిసిందే. అప్పట్లోనే దీనికి శంకుస్థాపన జరిగింది. అయితే 2019 ఎన్నికల్లో గెలిచి వైసీపీ అధికారంలోకి రావటంతో ఎన్‌ఆర్‌టీ ఐకానిక్ భవనం నిర్మాణం అటకెక్కింది. ప్రస్తుతం కూటమి సర్కారు అధికారంలోకి రావటంతో ఎన్‌ఆర్‌టీ ఐకాన్ భవనం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం ఏపీ ప్రభుత్వం నిర్మాణ కమిటీని నియమించింది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీలో ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ సీఈవో మెంబర్ కన్వీనర్‌గా, టర్నర్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ నుంచి ఒక సాంకేతిక సభ్యుడు, ఐదుగురు సభ్యులు ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు

# మరో ఇన్నర్ రింగ్ రోడ్డు

తిరుపతి, ఫిబ్రవరి 25, ఆంధ్రప్రదేశ్‌లో మరో రింగ్ రోడ్డుకు సంబంధించి ప్రతిపాదనలు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో పెద్దఎత్తున రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. రూ.506 కోట్ల అంచనా వ్యయంతో కుప్పానికి రింగు రోడ్డు, అంతర్రాష్ట్ర రహదారుల అభివృద్ధికి, వంతెనలకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ రింగ్ రోడ్డు, మిగిలిన పనులకు సంబంధించి ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. కుప్పం పట్టణానికి ఇన్నర్ రింగు రోడ్డును పూర్తి చేసేందుకు రూ.54 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు అధికారులు. ప్రస్తుతం ఉన్న రోడ్లని మరో 5 కిలోమీటర్లు నిర్మించి రోడ్డును పూర్తి చేస్తారు.కుప్పం నియోజకవర్గంలో 11 బ్రిడ్జిలను నిర్మించేందుకు 16వ ఆర్థిక సంఘం నిధులు రూ.38.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే నియోజకవర్గంలో 89 కిలోమీటర్ల రోడ్లను రూ.41.15 కోట్ల నాబార్డు నిధులతో అభివృద్ధి చేయనున్నారు. 67 కిలోమీటర్లున్న 8 రోడ్లను సీఆర్ఎఫ్ నిధులు రూ.134 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించారు అధికారులు. కుప్పం ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతంగా ఉంది.. అందుకే అంతర్రాష్ట్ర రహదారుల కనెక్టివిటీ పెంచేందుకు రూ.178.51 కోట్లతో ప్రతిపాదనలు పంపించామంటున్నారు అధికారులు. 43 కిలోమీటర్ల రోడ్లను కూడా 5 పనులుగా మంజూరుకు ప్రతిపాదించారు అధికారులు.చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక రెండుసార్లు కుప్పంలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆయనే స్వయంగా ప్రజల నుంచి పలు అర్జీలు స్వీకరించారు. 27 కిలోమీటర్లున్న 5 రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు అర్జీల్లో కోరారు. సానుకూలంగా చంద్రబాబు సానుకూలంగా స్పందించగా.. ఆ రోడ్లకు రూ.58 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నా రు. ఈ మేరకు దాన్ని కూడా తాజా ప్రతిపాదనల్లో పెట్టారు అధికారులు. అంతేకాదు కుప్పంలో అభివృద్ధి పనుల కోసం నిధుల్ని కూడా కేటాయిస్తున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గంలో పనులపై స్పెషల్‌గా ఫోకస్ పెట్టారు.. ఇటీవల నిధులు కేడా కేటాయించారు. తాజాగా రోడ్ల అంశంపై ఫోకస్ పెట్టారు. . మిగిలిన పనుల్ని చేపట్టారు.

# మార్చి నెల టెన్షన్...

విజయవాడ ఫిబ్రవరి 25,మార్చి నెల ఇంకో నాలుగు రోజుల్లో వచ్చేస్తుంది. మార్చి నెల వస్తుందంటే ఆంధ్రప్రదేశ్ లో కొందరు మంత్రులు భయపడిపోతున్నారు. ఎందుకంటే మార్చి నెల గంగడం పొంచి ఉందని ప్రచారం జరుగుతుండటమే అందుకు కారణం. మార్చి నెలలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన వెంటనే మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని చెబుతున్నారు. బడ్జెట్ సమావేశాల తర్వాత జనసేన నేత నాగబాబును మంత్రివర్గంలోకి చేర్చుకోనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా వస్తుంటంతో కొత్త వారికి అవకాశమిస్తారని జోరుగా టీడీపీలో ప్రచారం జరుగుతుంది. కూటమి ప్రభుత్వంలోని జనసేన, బీజేపీలకు చెందిన మంత్రులకు పెద్దగా భయం లేదు కానీ టీడీపీకి చెందిన మంత్రులే భయపడిపోతున్నారు.అయితే మంత్రి వర్గం ఏర్పడి కేవలం తొమ్మిది నెలలవుతున్నప్పటికీ ఇప్పటికీ అనేక మంది మంత్రులు పనితీరులో వెనకబడి ఉండటమే కారణం. సామజికవర్గంతో పాటు వివిధ అంశాలను ప్రాతిపదికగా చేసుకుని కొత్తగా ఎన్నికయిన వారు అంటే మొదటి సారి ఎమ్మెల్యేగా ఎన్నికయిన వారికి కూడా చంద్రబాబు తన మంత్రివర్గంలో చోటు కల్పించారు. యువకులయితే మరింత బాగా పనిచేస్తారని, తమకు కేటాయించిన శాఖలపై పట్టుసాధించడమే కాకుండా, తమకు అప్పగించిన జిల్లాలకు సంబంధించి కూటమి నేతల మధ్య సయోధ్య కుదురుస్తారని ఆయన గట్టిగా నమ్మారు. మరొక వైపు తనతో పాటు యువకులైతేనే పాలనలో పరుగులు పెడతారని నమ్మారు. కానీ ఊహించని దానికి విరుద్ధంగా జరుగుతుంది.ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ మంత్రులకు ర్యాంకులు కేటాయించారు. కనీసం ఫైళ్ల క్లియరెన్స్ లోనూ కొందరు మంత్రులు వెనకబడి ఉన్నారు. మరికొందరు మంత్రులు కేవలం బుగ్గకారులోనే తిరుగుతూ విపక్షం చేసే విమర్శలకు కూడా స్పందించడం లేదు. తన పేషీలపై కూడా పట్టులేకుండా కొందరు మంత్రుల వ్యవహరిస్తుండటాన్ని చంద్రబాబు గమనించారు. ఆయన ఎప్పటికప్పుడు మంత్రుల పనితీరుపై నివేదికలను తెప్పించుకుంటున్నారు. ఈ ప్రకారం చూస్తూ నాగబాబుతో పాటు నలుగురైదుగురు మంత్రులపై వేటు పడే అవకాశముందని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. వారి స్థానంలో సమర్థులైన వారిని నియమిస్తూ మరింతగా పాలన గాడిన పడుతుందని చంద్రబాబు విశ్వసిస్తున్నారు. కొందరు మంత్రులు ఇప్పుడిప్పుడే ఆకస్మిక తనిఖీలు, విపక్ష నేతపై విమర్శలు వంటివి చేస్తున్నారు. జగన్ ను తిడితే తమ పదవి పదిలంగా ఉంటుందని భావించి కొందరు అలా మాట్లాడుతున్నారు. కానీ చంద్రబాబుకు అన్నీ తెలుసు. ఏ మంత్రి పనితీరు ఎలా ఉందో? ఇప్పటి వరకూ జిల్లాల్లో వారు చేసిన పనులతో పాటు శాఖల్లో తీసుకున్న నిర్ణయాలను కూడా ప్రత్యేకించి నివేదిక తెప్పించుకున్న చంద్రబాబు అందుకు తగినట్లు చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పడే వేటు వేయకపోతే ఇక భవిష్యత్ లో పార్టీతో పాటు ప్రభుత్వం కూడా ప్రజల్లో కూడా చులకన అయ్యే ప్రమాదం ఉందని భావించినచంద్రబాబు ఈ మేరకు కఠిన నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

# టార్గెట్ కమ్మ సామాజిక వర్గం

గుంటూరు, ఫిబ్రవరి 25,  ఏపీలో రాజకీయాలు అంటేనే సామాజిక సమీకరణలపై ఆధారపడి ఉంటాయి. ఇక్కడ సామాజిక వర్గాలు రాజకీయాలను శాసిస్తుంటాయి. ఫలానా కులం ఫలానా పార్టీ అని చాలా సులువుగా చెప్పవచ్చు. కమ్మ సామాజిక వర్గం అయితే తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటే రెడ్డి సామాజిక వర్గం.. కాపులంటే జనసేన.. ఇలా రకరకాలుగా విశ్లేషించుకోవచ్చు. అయితే ఒక రాజకీయ పార్టీకి బలమైన మద్దతుదారులుగా సామాజిక వర్గాలు ఉంటాయి. ఇవి సహజం కూడా. అయితే కొన్ని సామాజిక వర్గాలు కొన్ని పార్టీలను విపరీతంగా ద్వేషిస్తుంటాయి. 2019లో రెడ్డి సామాజిక వర్గం టిడిపిని ద్వేషించింది. 2024 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కమ్మ సామాజిక వర్గం ద్వేషించింది. అయితే రాజకీయ పార్టీలకు సామాజిక వర్గాల మద్దతు మాట అటుంచితే.. శత్రువులుగా మారిపోవడం ఇటీవల పరిపాటిగా మారింది. అందుకే పార్టీలు ఇప్పుడు సామాజిక వర్గాల వ్యతిరేకి అనే ముద్ర పోగొట్టుకునేందుకు ఎక్కువ ప్రయత్నాలు చేస్తుంటాయి. ఇప్పుడు అదే ప్రయత్నంలో ఉన్నారు వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి.ఈ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా బలంగా పనిచేసింది కమ్మ సామాజిక వర్గం. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో స్థిరపడిన కమ్మ సామాజిక వర్గం వ్యక్తులు ఏకతాటిపైకి వచ్చారు. తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం విశేషంగా కృషి చేశారు. దీనికి కారణం లేకపోలేదు. గత ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కమ్మ సామాజిక వర్గం ఒక రకమైన దాడి జరిగింది. వారి ఆర్థిక మూలాలపై దాడులు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆ సామాజిక వర్గానికి చెందిన వారి పరిశ్రమలను వెళ్ళగొట్టారు. వీటన్నింటికీ తోడు చంద్రబాబును జైలులో పెట్టి ఇబ్బంది పెట్టారన్న కసితో కమ్మ సామాజిక వర్గం ఒకే తాటి పైకి వచ్చింది. అయితే 2019లో రెడ్డి సామాజిక వర్గం చేసిన ఫైట్.. 2024 ఎన్నికల్లో కనిపించలేదు. అది జగన్మోహన్ రెడ్డికి మైనస్ గా మారింది.వాస్తవానికి ఏ సామాజిక వర్గాన్ని దూరం చేసుకోవాలని వ్యూహం ఉండదు ఏ రాజకీయ పార్టీకి. అందుకే జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్లుగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేతలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆ సామాజిక వర్గానికి చెందిన కొడాలి నానికి మంత్రి పదవి ఇచ్చారు. కానీ విస్తరణలో భాగంగా తీసేసారు. వల్లభనేని వంశీ మోహన్ లాంటి నేతలు వైసీపీలోకి ఫిరాయించారు. కరణం బలరాం వంటి సీనియర్ను ప్రలోభ పెట్టి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. దేవినేని అవినాష్ వంటి నేతకు ప్రోత్సహించారు. అయితే అదే సమయంలో కమ్మ సామాజిక వర్గం మూలాలపై దెబ్బ తగలడంతో వారు వీటిని పరిగణలోకి తీసుకోలేదు. ఒకరిద్దరు నాయకుల తప్ప కమ్మ సామాజిక వర్గాన్ని తొక్కేసారన్న ఆరోపణలను మూటగట్టుకున్నారు జగన్మోహన్ రెడ్డి. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత జగన్మోహన్ రెడ్డికి దీని పర్యవసానాలు తెలిసాయి. అందుకే దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది.వల్లభనేని వంశీని పరామర్శించడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో చాలామందికి నచ్చలేదు. కొంతమంది సీనియర్లకు కూడా ఇది మింగుడు పడలేదు. గత ఐదేళ్లలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెంచడానికి వల్లభనేని వంశీ లాంటి నేతలు కారణం. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపడంతో పాటు కమ్మ సామాజిక వర్గానికి అండగా నిలిచారన్న అంశం ముఖ్యం. దానిని గుర్తించిన జగన్మోహన్ రెడ్డి వల్లభనేని వంశీని పరామర్శించారు. అటు తన వెంట కొడాలి నానితో పాటు దేవినేని అవినాష్ ను పెట్టుకున్నారు. చంద్రబాబు,తన కుమారుడు ఎదగాలన్న కోణంలోనే ఆలోచిస్తున్నారని.. కమ్మ సామాజిక వర్గంలో ఇతర నేతల ఎదుగుదల వారికి ఇష్టం లేదని వ్యాఖ్యానించారు జగన్మోహన్ రెడ్డి.

# జగన్ ఎందుకిలా...

విజయవాడ, ఫిబ్రవరి 25, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలకు వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఎందుకంటే ఆయన తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తానని ఖచ్చితంగా చెబుతున్నారు. ఆయనతో పాటు పది మంది ఎమ్మెల్యేలు కూడా సభకు హాజరు అయ్యే ఛాన్స్ లేదు. గెలిచిన పదకొండు మంది ఎమ్మెల్యేల్లో కొత్తగా గెలిచిన వారు కూడా ఉన్నారు. వారికి కూడా తాము సభకు వెళ్లి తమ నియోజకవర్గ సమస్యలపై ప్రశ్నించాలని ఉంటుంది. జగన్ హుకుం కారణంగా వారు అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. పార్టీ అధినేతగా ఆయన సభకు దూరంగా ఉండవచ్చు. అంతే తప్ప మొత్తం వైసీపీ ఎమ్మెల్యేలను ఆపే హక్కు ఎక్కడిది అని కొందరు నేతలు ప్రశ్నిస్తున్నారు. అయితే నెంబరు వల్లనే తాము ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని అధికార పార్టీ నేతలు స్పష్టంగా చెబుతున్నప్పటికీ దానిని పట్టుకుని వేలాడితే ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నిస్తున్నారు. సభకు వెళ్లాలి. అవమానాలు భరించాలి. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు దాదాపు మూడున్నరేళ్ల పాటు సభకు రాలేదా? అని ప్రశ్నిస్తున్నారు. అవమానాలు భరించాలని, అప్పుడే మరింత సానుభూతి పెరుగుతుందని చెబుతున్నప్పటికీ జగన్ తన చెవులకు ఎక్కించుకోవడం లేదని వైసీపీ నేతలే చెబుతున్నారు. అసెంబ్లీని బాయ్ కాట్ చేస్తున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ శాసనమండలి విషయంలో మాత్రం అలాంటి షరతులు ఉంచలేదు. అక్కడ తమ పార్టీ బలం ఎక్కువగా ఉండటంతో ఎమ్మెల్సీలు సభకు హాజరవుతున్నారు. అవమానకరమైన మాటలు వినాల్సి వస్తుంది. సెటైర్లు చెవిన పడతాయి. జగన్ కు మాట్లాడే అవకాశం స్పీకర్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆ ఇచ్చిన సమయంలో ప్రజా సమస్యలను ప్రస్తావించవచ్చు. అదే సమయంలో అధికార పార్టీపై కూడా విమర్శలు చేయవచ్చు. అంతే తప్ప తనకు అధికారం ఇస్తే తప్ప అసెంబ్లీకి రానని మొండికేస్తే ఎవరికి నష్టం అని నిలదీస్తున్నారు. ప్రజల్లోకి వెళ్లినా సభలో వేసే ప్రశ్నలు రికార్డవుతాయి. అవి పదికాలం పాటు గుర్తుండిపోతాయి. సభకు వెళ్లినంత మాత్రాన జగన్ గౌరవానికి భంగం కలిగించేందుకు ఎవరూ ప్రయత్నించరు. ఒకవేళ ప్రయత్నించినా వారిని ప్రజలు ఛీత్కరించుకుంటారు. గత శాసనసభలో అలా వ్యవహరించిన వారిని ప్రజలు ఓడించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలి. అందులోనూ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. టీడీపీ కూటమి ఎన్నికల సందర్భంగా అనేక హామీలు ఇచ్చింది. రాజధాని అమరావతి నిర్మాణం,



పోలవరం ప్రాజెక్టు వంటి కీలక అంశాలున్నాయి. వీటిపై అధికార పక్షాన్ని నిలదీసేందుకు వచ్చిన అవకాశాన్ని చేజేతులా జగన్ చేజార్చుకుంటున్నారని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు. బయట ఎంత మొత్తుకున్నా, మీడియా సమావేశాలు పెట్టి విమర్శలు చేసినా ఫలితం లేదు. ప్రజా సమస్యలకు రెస్పాన్స్ రావాలంటే సభకు వెళ్లాలని పలువురు వైసీపీ సీనియర్ నేతలు కూడా చెబుతున్నప్పటికీ జగన్ మాత్రం పట్టించుకోవడం లేదు. బెంగళూరులో కూర్చుని శాసనసభ సమావేశాలు ప్రత్యక్ష ప్రసారాలను చూస్తారేమో. మరి జగన్ ఇకనైనా ఆలోచనను మార్చుకుని సభకు రావాలని వైసీపీ క్యాడర్ కూడా కోరుతుంది.

మండలి సెంట్రిక్ గా రాజకీ?యం

సమావేశాలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హాజరుపై ఫుల్ క్లారిటీ వచ్చింది. ఈరోజు సభకు హాజరయ్యారు జగన్మోహన్ రెడ్డి. పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి శాసనసభకు వచ్చారు. అప్పటికే గవర్నర్ ప్రసంగం కొనసాగుతోంది. ఈ క్రమంలో అక్కడికి దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. గవర్నర్ ప్రసంగాన్ని సైతం బహిష్కరించి బయటికి వచ్చేశారు. ప్రతిపక్ష హోదా ఇచ్చేవరకు సభలో అడుగు పెట్టమని తెలిసి చెప్పారు. అయితే బడ్జెట్ ప్రవేశ పెట్టే రోజు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు హాజరవుతారని అంతా భావించారు. దానిపై కూడా ఫుల్ క్లారిటీ ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి. కూటమి ప్రభుత్వానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇచ్చే ఆలోచన లేదని.. అందుకే శాశ్వతంగా శాసనసభ సమావేశాలను బహిష్కరిద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు జగన్. 2029 ఎన్నికల వరకు బయట జనాల్లో సమస్యలపై పోరాటం చేద్దామని చెప్పుకొచ్చారు. అయితే శాసనమండలిలో వైసిపి సభ్యులు హాజరవుతారని ప్రకటించారు జగన్మోహన్ రెడ్డి. వాస్తవానికి ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత శాసనసభకు వచ్చారు జగన్. పులివెందుల శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. తరువాత ప్రతిపక్ష హోదా ఇవ్వలేదన్న సాకుతో సభకు హాజరు కాలేదు. ఈరోజు మాత్రం బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో హాజరవుతారని అంతా భావించారు. అందరూ భావించినట్టే జగన్ శాసనసభ సమావేశాలకు వచ్చారు. కానీ గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరించి బయటకు వెళ్ళిపోయారు. ఇకనుంచి ఎమ్మెల్యేలు ఎవరు శాసనసభ సమావేశాలకు హాజరు కారని.. ఎమ్మెల్సీలు మాత్రం శాసనమండలి సమావేశాలకు హాజరవుతారని ఫుల్ క్లారిటీ ఇచ్చారు.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓ 30 మంది వరకు ఎమ్మెల్సీలు ఉన్నారు.

## శివరాత్రి బ్రహ్మోత్సవాల భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కర్నూలు రేంజ్ డీఐజీ,నంద్యాల జిల్లా ఇంచార్జి ఎస్పీ..





విభారే న్యూస్ ఫిబ్రవరి 25 శ్రీశైలం..శ్రీశైలంలో జరుగుచున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన భద్రత చర్యలను నంద్యాల జిల్లా ఇంచార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐ పి ఎస్ తో కలిసి కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐ పి ఎస్ పరిశీలించారు.శ్రీశైలం దేవస్థానంలోని క్యూ లైన్ లు,గుడి పరిసరాలు పరిశీలించారు. సి సి కెమెరాల కంట్రోల్ రూమ్ ను పరిశీలించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల భద్రత చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కర్నూల్ రేంజ్ డీఐజీతో పాటు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్, డీఎస్పీ రామాంజి నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మోహన్ రెడ్డి ఉన్నారు.

## స్పెషల్ అదార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

### మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 25-నంద్యాల పట్టణంలో ఆధార్ లేని పిల్లలు 0-6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ చేయించుకొనుటకు 24 వతేది నుండి 28- వరకు నంద్యాల పట్టణంలోని వివిధ వార్డులలో ఆధార్ క్యాంప్ నిర్వహించుట జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు . ఆయన మాట్లాడుతూ జనన ధృవీకరణ పత్రము ఉండి ఆధార్ కార్డు లేని వారికి, ఆధార్ కార్డు డాక్యుమెంట్ అప్డేట్. 24- తేదీ నుండి 28- తేదీ వరకు 0 6 సంవత్సరాల లోపు వారు 21,916 మంది, 5 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల లోపువారు 63,498 మంది, 15 సంవత్సరాల నిండిన వారు 68,078 మంది, మొత్తం 1,31,576 మందికి ఆధార్ కార్డు నమోదు చేసుకొనుట కొరకు స్పెషల్ డ్రైవ్ క్యాంప్, నిర్వహిస్తున్నట్లు తెలిపారు నంద్యాల పట్టణములోని సచివాలయ సిబ్బంది తమ తమ సచివాలయ పరిదిలోని స్కూల్స్ లలో అంగన్ వాడి టీచర్లు, విద్యార్థులకు, ప్రజలందరికీ తెలియపరిచి ఈ అవకాశాన్ని వినియోగించుకొనవలసినదిగా సూచించారు.

## మల్యాల గ్రామంలో పొలంబడి కార్యక్రమం






విభారె న్యూస్ నందికొట్కూరు మా ప్రతినిధి ఫిబ్రవరి 25: నందికొట్కూరు మల్యాల గ్రామంలో శ్రీనిట ఉంఖపొలంబడి కార్యక్రమంలో భాగంగా ఎక్స్టర్నల్ ఇన్స్పెక్షన్ కోసము స్టేట్ ఏ పి స్ ఓ పి సి ఏ ఆఫీస్ నుంచి డి ర్ .ఎం. ప్రతాపరెడ్డి మరియు నందికొట్కూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సి విజయ శేఖర్ మరియు నందికొట్కూరు అగ్రికల్చర్ ఆఫీసర్ మరియు మిడ్తూర్ పిఅగ్రికల్చర్ ఆఫీసర్ నందికొట్కూరు మిడుతూరు గ్రామాల్లో జరిగిన శ్రీనిట ఉంఖ పొలంబడి పొలాలను సందర్శించి పప్పు శనగ శాంపిల్ టెస్టింగ్ కొరకు పంపడమైనది. మరియు వ్యవసాయ అధికారులు రైతు సోదరులకు తగు సలహాలు సూచనలు వివరించారు.

# అంగన్వాడి జ్ఞాన జ్యోతి ఆరు రోజుల శిక్షణ పూర్తి






విభారె న్యూస్ నందికొట్కూరు మా ప్రతినిధి ఫిబ్రవరి25: నందికొట్కూరు నియోజవర్గం జూపాడుబంగ్లా మండలంలో ఎంఈఓ మద్దిలేటి ఆధ్వర్యంలో అంగన్వాడి జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణ ట్రైనింగ్ ముగిసింది. అంగన్వాడి శిక్షణ ట్రైనింగ్ లో ఆరు రోజులు పిల్లలతో ఎలా సెంటర్లో ఆడిపించాలి. వాళ్ళ మైండ్ ను ఎలా డెవలప్ చేయాలి మేధాశక్తిని ఎలా పెంపొందించాలి.వాళ్లలో స్కిల్ డెవలప్మెంట్ ఎలా మెరుగుపరచాలి వాళ్లతో ఎలా ఆటలాడిపించాలి వాళ్లలో శారీరిక అభివృద్ధి ఎలా పెంపొందించాలి భాషాభివృద్ధి ఎలా పెంపొందించాలి మేధాశక్తి ఎలా గుర్తించగలగాలి సుష్మ కండరాల అభివృద్ధి స్థూల కండల అభివృద్ధి ఎలా పెంపొందించాలి అనే దాని గురించి స్కూల్ టీచర్స్ ఉస్మాన్ భాష ,హనుమంత రెడ్డి, రసూల్ , సూపర్వైజర్లు పావని ,నిర్మలమ్మ ఎంఈఓ సార్ మద్దిలేటి టీచర్లకు వివరించి వారితో చేయించడం జరిగింది. ఎంఈఓ మద్దిలేటి అంగన్వాడి టీచర్లకు ట్రైనింగ్ సర్టిఫికెట్స్ కూడా అందజేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు భారతమ్మ, శ్రీదేవి సురేఖ, రమణమ్మ, పద్మావతి లక్ష్మీదేవి ,ప్రమీలమ్మ తులసమ్మ, ప్రసన్న అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు..

## కృష్ణానది యాజమాన్యం బోర్డు ను కర్నూలు లో ఏర్పాటు చేయాలి


### రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 25- ఏపీ అంటే అమరావతి పోలవరం కాదు.. ఇది "అందరి ప్రదేశ్" ... అని పాలకులు గుర్తెరగాలని రాయల సీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాయలసీమలో మరమ్మత్తులకు నోచుకోక శిథిలావస్థలో వున్న ప్రాజెక్టులకు నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం అమరావతి లో వందల కోట్లు ఖర్చుతో నూతన రిజర్వాయర్లను నిర్మించ తలపెట్టిన ప్రభుత్వ తీరు పట్ల రాయలసీమ సమాజం ఆగ్రహం వ్యక్తం చెస్తోందన్నారు. కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని కోరుతూ రాయలసీమ సాగునీటి సాధన సమితి ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం నంద్యాలలో వందలాది మంది రైతులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి వైసిపి, సిపిఐ, సిపిఎం, ముస్లిం లీగ్, ఎఐకెయస్ తో పాటు రైతు, వాణిజ్య,వర్తక, కార్మిక సంఘాలతో పాటు ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించి ర్యాలీలో పాల్గొన్నారు. నంద్యాలలో పెద్ద బండ దగ్గర ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయం నుండి గాంధీ చౌక్ కల్పనా సెంటర్ శ్రీనివాస నగర్ సెంటర్ మీదుగా తాలూకా ఆఫీస్ కార్యాలయం వరకు జరిగిన కార్యక్రమంలో పలు సెంటర్స్ లో రాజకీయ పార్టీ ప్రతినిధులు ప్రజాసంఘాల ప్రతినిధులు వెనకబడిన ప్రాంతాల ప్రభుత్వ ఆలక్ష్యాన్ని తీవ్రంగా నిరసించారు. రాయలసీమ పట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజా సంఘాలకు అడుగడుగునా స్థానిక ప్రజలు స్వాగతం పలకడమే కాకుండా అనేక ప్రదేశాల్లో మంచినీళ్లు, మజ్జిగ ఏర్పాటు ప్రజల ఆశల, ఆకాంక్షల స్థాయిని తెలుపుతుందని వక్తలు పేర్కొన్నారు. ర్యాలీ సందర్భంగా పెల్లుబికిన ప్రజల ఆశల, ఆకాంక్షలను ప్రభుత్వం అర్థం చేసుకొని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతుందన్న భావనను ఈ సందర్భంగా వక్తలు వ్యక్తపరిచారు. అనంతరం తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అనేక ప్రజా సంఘాలు, రైతులు పాల్గొన్నారు.

## శివయ్య పండుగ -ఏర్పాట్లు దండిగా





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 25- నంద్యాల పట్టణం రైతునగరం దగ్గర వెలసిన శ్రీ గౌరీ కేధారనాధ్ స్వామి ఆలయంలో రెండు రోజుల పాటు జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ అన్నపురెడ్డి లింగారెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ 26 వ తేది మహా శివరాత్రిని పురస్కరించుకుని పలు పూజాదికాలు. అభిషేకాలు సాయంకాలం ప్రదోశకాలములో గం॥ 8-00 లకు సహస్ర లింగార్చన, లింగోద్భవ సమయములో విశేష ద్రవ్య అభిషేకము, ఏక వార రుద్రాభిషేకము, మరియు లింగోద్భవ అనంతరం "శ్రీ గౌరీ కేధారనాధ్ స్వామి" వార్ల కళ్యాణోత్సవ కార్యక్రమము జరుగునని తెలిపారు .తీర్థ ప్రసాద వితరణ జరుగునని . స్వామి అమ్మవార్ల మాఢవీధులలో ఊరేగింపు కార్యమ్రము జరుగుతుందన్నారు .27 వ తేది సాయంకాలం గ్రామోత్సవము జరుగుతుందని తెలిపారు .భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు .

## హమాలీల నిధులను వెంటనే విడుదల చేయాలి

### 7వ తేదీ డీఎం కార్యాలయం ముట్టడిస్తాం




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 25-హమాలీల కూలి రేట్ల నిధులను విడుదల చేయాలని లేని పక్షంలో 7 వ తేదీన విజయవాడలో డీఎం కార్యాలయం ముట్టడిస్తామని సిఐటియు నాయకులు హెచ్చరించారు. సివిల్ సప్లై హమాలీల కూలి రేట్లు పెంచి వెంటనే ఇవ్వాలని, 13 నెలలుగా పెండింగ్లో ఉన్న కూలీల నిధులను వెంటనే విడుదల చేయకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సిఐటియు పట్టణ కార్యదర్శి కె. మహమ్మద్ గౌస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రెండవ రోజు సివిల్ సప్లై గోడౌన్ హమాలీ కార్మికులు ఎమ్. ల్. యస్ పాయింట్ దగ్గర నిరసన తెలిపారు . ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి గోపాల్, స్వాములు తో పాటు మరో ముప్పై ఐదు మంది కార్మికులు పాల్గొన్నారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి కె. మహమ్మద్ గౌస్,యూనియన్ కార్యదర్శి గోపాల్ లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 9 నెలలు కావస్తున్న నేటి వరకు గత ప్రభుత్వం పెంచిన కూలిరెట్ల ను విడుదల చేయడంలో నిర్లక్ష్యం తగదని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. , ఇప్పటికే పెండింగ్లో ఉన్న ఈపీఎఫ్ కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మె ఈనెల 28 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.అప్పటికిపరిష్కారకాకపోతేమారి 7న విజయవాడలోని డిఎం కార్యాలయం ముట్టడి చేయడం జరుగుతుందని తెలిపారు , అప్పటికి దిగి రాకపోతే రాష్ట్రవ్యాప్తంగా కార్మికులంతా నిరవధిక సమ్మెకైనా దిగాల్సి వస్తుందని ప్రజల ఇబ్బందులు పడతారని ప్రభుత్వం పైన తీవ్ర వ్యతిరేకత వస్తుంది వెంటనే ప్రభుత్వం కళ్లు తెరిచి సివిల్ సప్లై హమాలీ కూలిరేట్లను పెంచి వెంటనే అమలు చేయాలని అన్నారు.

## చెంచుల అభివృద్ధే నా ధ్యేయం :ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 25-నల్లమల అరణ్యంలోని చెంచుల అభివృద్ధికి నిధుల కొరత లేదని, ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం చెంచుల సంక్షేమం కోసం ప్రత్యేక కొత్త పథకం ఏర్పాటు చేసి వారి అభివృద్ధి, సంక్షేమం కోసం అవసరమైన నిధులు వెంటనే మంజూరు చేస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.శ్రీశైలం పాదయాత్రగా వెళ్ళుతూ నల్లమల అరణ్యంలోని చెంచుల రాజధాని పెచ్చేరువు చెంచుగూడెంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెంచు మహిళలు, గూడెం పెద్దలతో వారి సమస్యలు తెలుసుకునేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. క్రూర మృగాలు, విష సర్పాల మధ్య కనీస వసతులకు దూరంగా బ్రతుకుతున్నామని, అటవీ అధికారుల వేధింపులు తొలగించాలని, ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల నిర్మాణం పనులు చేయకుండా అటవీ అధికారులు అడ్డుపడుతున్నారని, తదితర సమస్యలను వినతి పత్రం ద్వారా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి చెంచు మహిళలు అందించారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ 20 రోజుల క్రితమే నంద్యాల పార్లమెంట్ పరిధిలోని చెంచులకు 600 లకు పైగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా పక్కా గృహాలు మంజూరు చేయడం జరిగిందని, సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాలచెంచు గూడెంలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ. 4.40 కోట్ల తో తారు రోడ్డు మంజూరు చేయడం జరిగిందని, రూ. 1.50 కోట్ల నిధులతో ఈ గూడెంలలో విద్యుత్ సరఫరాకు నిధులు మంజూరు చేయించి కరెంటు పనులు పూర్తి చేశామన్నారు. చెంచు చిన్నారులను బడులకు పంపించేందుకు, వారిలో అవగాహనా కల్పించేందుకు తాను చెంచు గూడెంలలో పర్యటన చేశానని ఆమె అన్నారు.

## శుక్రవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక చండీ హోమం..

విభారే న్యూస్ ఫిబ్రవరి 25 కర్నూలు జిల్లా ప్రతినిధి..28.02.2025 శుక్రవారం అమావాస్య సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఉదయం 9 గంలకు నవగ్రహ, లక్ష్మీ గణపతి, మూల మంత్ర సహిత చండీహోమం నిర్వహించబడును. ఈ చండీహోమం చేసుకోవటం వలన సమస్త శతృ,రుణ, రోగ,బాధలు తొలగి సకల కార్య జయం కలుగుతుంది. అమ్మవారి అనుగ్రహం వలన ఆయురారోగ్య ఐశ్వర్యములు సిద్ధించి చండీ పరదేవత అనుగ్రహం కలుగుతుంది. హోమం ప్రధానంగా :- 4000/ సంకల్పం:-116/- సంప్రదించవలసిన నెం :- డి.లక్ష్మీనరసింహ శర్మ :- 8008774086 ఫోన్ పే గూగుల్ పే నెంబరు..8896123777.ఆఫీసు ల్యాండ్ ఫోన్ నెంబర్..08518-234388..

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190